

# ఫిజిక్సు మేష్టారు

పరంధామయ్య ఎమ్. ఎ, ఎల్‌టి ఫస్టు క్లాసుగారి జీవితమంతా పరులకే అంకితమై పోయింది. ఆయన పాతికేళ్ళ హైస్కూల్లో ఫిజిక్సు పాఠాలు బోధించి 'రిటైయిర్ అయి, ట్యుటోరియల్ కాలేజీలోచేరి అక్కడ పదేళ్ళగా అదే పని చేస్తున్నారు. ఎమ్. ఎ. ఎల్‌టి ఫస్టుక్లాసుగదా హైస్కూల్లో ఎందుకు చేరారంటారేమొ, అది అంతే. ఆయన హైస్కూల్లోనే చేరాలనుకున్నారు. చేరారు. ఆయనకి చిన్న పిల్లల్లో చిన్నవాడిగా కలిసిపోవడం, వాళ్ళని పిక్నిక్కులు ఎక్స్‌కర్షన్‌లకి పట్టుకెళ్ళడం కబుర్ల మధ్యనే విజ్ఞాన విషయాలు చెప్పడం, మనస్సు లేతగా వున్నప్పుడే విశాల దృక్పథాల వైపు మళ్ళించాలని ఆయన తాపత్రయ పడతారు. ఫిజిక్సు మేష్టారన్నా ఫిజిక్సు క్లాసన్నా పిల్లలకు సరదా. మేష్టారుక్లాసు లవ్‌లీగా వుంచుతారని, ఒకసారివింటే యింటి దగ్గర పుస్తకం తెరవకపోయినా అర్థమై పోతుందని ఫిజిక్సు తేలికని చాలా ఇంట రెస్టింగ్ సబ్‌జక్టని అనుకుంటారు, అంత కొరకరాని సబ్‌జక్టుని తేలిగ్గా బోధించడం పరంధామయ్యగారి ప్రత్యేకత మరి. 'పిల్లలు చదవరా? మేష్టారే చదువుతారా?' అని అప్పుడప్పుడు ఆయన భార్య రుక్మిణమ్మగారు విసుక్కుపోతూ వుంటుంది. ఆయన మర్నాటి పాఠం ప్రిపేరు చెయ్యంది క్లాసుకి వెళ్ళరు, రాత్రి 11 గంటలవరకు పుదయం ఆరునుండి ఎనిమిదిన్నర అయే వరకు ఆయన కూర్చున్న బాసినపట్టు విడవరు. మర్నాటి పాఠం ప్రిపేరు చెయ్యడం, ప్రశ్నాపత్రాలు రాయడం జవాబులు దిద్దడం మంత్లీ టెస్టులు, మళ్లీ టెస్టులతో ఆయనకి క్షణం తీరికవుండదు. సెలవ రోజుల్లో స్పెషల్ క్లాసులు. ఉపాధ్యాయుల యెడల గవర్నమెంటువారు పుదాసీనంగా వున్నా చాలీ చాలని జీతాలు యిచ్చినా వారిచ్చే జీతానికి రెండింతలుగా కష్టపడే ఈ భర్తగారిని చూసి భార్య వుస్సు

రంటుంది. 'రోజుకి ముప్ఫయిగంటలున్నా మీకు పని వుంటూనే వుంటుంది. మీకు విశ్రాంతి ఎప్పుడ'ని భార్య విసుక్కుంటుంది. అందరు వోవర్‌టైంచేసి డబ్బు పుచ్చుకుంటారు. స్ట్రైకులుచేసి జీతాలు బోనస్సులు పెంచుకుంటున్నారు. మేష్టర్లు స్ట్రయికు చెయ్యరు. ఒకనెల స్ట్రయికునుండి జీతం రాకపోతే వస్తులుండాలి. ఒక నెలేమిటి? రెండు రోజులు జీతం రావడం ఆలస్యం అయినా కటకటలాడిపోవాలి గదా. యిహ వీళ్లు స్ట్రయికులేం జేస్తారు. వీరు భావి పౌరులకు అణుకువ విధేయత నేర్పవలసిన వారుగదా! స్ట్రయికంటేనే అదోరకం అల్లరి అవిధేయతగా తోచికూడా అందులో చొరబడలేరు. పైగా గవర్నమెంటుకూడా జాతికి వెన్నెముకైన ఉపాధ్యాయుల్ని గుర్తించామని మనదేశంలో వుపాధ్యాయులు 'పూర్లీపెయిడ్' అని చెప్పకోడం సిగ్గుచేటని వారి జీతాలు పెంచడానికీ, ముసలితనపు పెన్షన్‌ను గ్రాట్యుయిటీల గురించి ఆలోచిస్తూనే వున్నామని వొకేరకం క్వాలిఫికేషన్ వారికందరికి జీతాలు వొకేలా వుండేలా చేస్తామని వీరి వెన్ను రాస్తూనే కాలాయాపన చేస్తున్నారు గదా అనుకుంటూ భార్య తలపోసింది. రమణమ్మగారు ఆధునిక మనే చెప్పాలి. ఆవిడ ప్రభ, పత్రిక చదువుతుంది. వంటా వార్పులకు ఫలాని వస్తువు తయారీకి ఫలాని వారు యిచ్చినకొలతలు సరియైనవికావని ఖండిస్తుంది. ఆవిడ 'శుచి—రుచి' అని వంటింటి కళమీద హస్తపాకంమీద మూడొందల పేజీలు పుస్తకం రాసారు. యే యే దేముళ్లకు యేయేరకం పిండి వంటలు పెట్టి ప్రసన్నులని చేసుకోవాచ్చో రాసారు. అన్నిరకాల వూరగాయలు డీల్ చేసారు. ఆ పుస్తకం హైస్కూల్సుకి టెక్స్టుబుక్‌గా పెట్టించాలని అభిలాష పడుతోంది. ఎవరి ప్రోపకమేనా లభిస్తే అదెంతపని? ఆవిడ క్లబ్బులో పావలా మెంబరు. క్లబ్బు యాక్టివిటీస్‌లో పాల్గొంటుంది. అనగా శ్రీరామనవమి వినాయక చవితి వరలక్ష్మీవ్రతం యిత్యాదులకు అటుకుల పులిహోరకిసొప్పు, ఆవిడే దగ్గిరుండి చెప్పాలి. అప్పుడే దానిరుచి. స్వాతంత్ర్య దినంముందు రూపాయి మెంబర్లు, లైఫ్ మెంబర్లు, లైఫ్‌మెంబరు ప్లస్ లైఫ్

# ఋషితుల్య మేష్టారు

ప్రెసిడెంటుగార్లతో కలెక్టరు గారింటికి వెళ్తుంది, ఆయన భార్యని జెండా ఆవిష్కరణకి ఆహ్వానించేందుకు మెంబర్లందరికి రమణమ్మగారంటే చాలా గౌరవం. చాలా చమత్కారంగా మాట్లాడుతూ అందర్నీ నవ్విస్తుంది. అందరితాలూకూ కాకపోయినా చాలామంది తాలూకు పిల్లలు మేష్టారిగారివద్ద చదువుతున్నవారే స్వల్పకాలంలో ప్రైవేటుగా మెట్రిక్‌ప్యాస్ అయిపోతారని చాలామంది పిల్లల్ని ట్యుటోరియల్ కాలేజీలో చేరుస్తారు. కొందరు మెంబర్లు ఈవిణ్ణి పేరుపెట్టికాక మేష్టరమ్మగారనే పిలుస్తారు.

మేష్టారు పద్మాసనంలో కూర్చొని రాసుకుంటుంటే రమణమ్మగారు చూసి 'ఈయన పూర్వజన్మలో ఋషికాదు గదా! పాపం తపోభంగమై వుంటుంది. యేస్త్రీని కన్నెత్తి చూడరే? తపోభంగం ఎల్లా అయి వుంటుందో? చూడకపోవడమే ఎవర్తికో కినుక గల్పించి శపించివుంటుంది. ఆస్త్రీని నేనే నేమొ! ఆయన్ని ఈ భూలోకంలోకి లాక్కొచ్చి ఆయన సహధర్మ చారిణి నయాను!!'

మేష్టరుగారు తన్ని రంభఅన్న రోజులు జ్ఞాపకం వచ్చాయి. మేష్టారికి దగ్గరగా జరిగి ఎందుకండి రాత్రి పగలుఅంత కష్టపడతారు? అర్ధశతాబ్దమై చెప్తున్న పాఠమేయైనా రోజూ తయారు చేసుకోవాలా? పోనీ ఆ రాసే నోట్సుయినా అచ్చు

> **తూర్పు ప్రసవించిన**
>
> **మార్పు**
>
> మతోన్మాద కాష్ఠంలో
> నిర్మించిన పంజరాన
> మానవతకు నిర్బంధం
> ఎన్నాళ్లిక సాగుతుంది?
>
> పాకిస్తాన్ రాబందుకు
> తెగిపోయిందొక్క రెక్క
> నిరంకుశుల రాజ్య చక్ర
> మిక విరిగిందొక్క పక్క
>
> — మిరియాల రామకృష్ణ

వేయించరాదు డబ్బైనా వస్తుంది?

'ఇదిగో నేను యే బై యేళ్ళ బట్టి చెప్తున్న పాఠమేయైనా వొక్కరికే చెప్పడం లేదు చూడూ! ప్రతియేడు పిల్లలు మారుతూ వుంటారు. అందరి గ్రహణ శక్తి వొక్కలాగవుండదు. అందరికీ బోధపడేట్టు చెప్పడానికి నేను రోజూ నేర్చుకుంటూనే వుండాలి. ప్రతివొక్కడి విషయం నేను జాగ్రత్తగా కనుక్కుంటాను. వీళ్ళకి పరిక్షలో ఆఖరిమార్కు అరవైయేనా రాకపోతే ముందు ముందు ఎల్లా బాగుపడ్తారు?'

మేష్టారు రోజూ యింత దీర్ఘోపన్యాసం యివ్వరు. ఇది నూమారెప్పుడో అన్నవిషయం. రోజూ అయితే ఆయనచెప్పే జవాబు 'దయచేసి నన్ను మాటల్లోకి దింపకు' అంటారు. అది ఆయన భార్య నుద్దేశించి మాట్లాడే మొదటి మాటైతే రెండోది 'వంటయిందా?' అని, మూడోది 'తలుపేసుకో' నిత్యం ఈ మూడు మాటలే ఆయన రోజూ భార్యతో మాట్లాడేవి. ఆవిడ 'వంటయింది రండి. గోరు చిక్కుడు ఆవపెట్టాను. కాస్త ముందుగావచ్చి తృప్తిగా భోంచెయ్యండి ఈపూటయినా' అని పిలుస్తుంది. ఆయన అదిగో యిదిగోనని వచ్చేప్పటికి ఆలస్యమై ఆదరాబాదరా భోంచేసి వెళ్ళిపోతారు. పాపం ఆ యిల్లాలు 'ఈయనకి కూర వుడకేసి పడేసినా ఆనా నువ్వు గుండలు పెట్టినా వొకటే'నని చింతిస్తుంది.

* * *

'నమస్కారం మేష్టారూ! నేను నరసింహారావుని. మీకు థర్డ్‌పీరియడ్ లీజర్ అని మా రామం చెప్తే కలుసుకుందామని వచ్చాను. మానెవ్వూ రామం ప్రీమెట్రిక్‌లో వున్నాడు. నేను...చీఫ్ యింజనీరుగా వుంటున్నాను. మిమ్మల్ని చూస్తే నేను చదువుకునేరోజులు జ్ఞాపకం వస్తున్నాయి. మీరేం మారలేదు మేష్టారూ' అన్నాడు వోల్డ్ స్టూడెంటు నరసింహారావు.

'...అల్లాగా ప్రయోజకుడవైనావు. నాకది గర్వంగావుంది. నాకు మీరెవరో సరిగా గుర్తురావడంలేదు సుమా, ఎంత ప్రయత్నించినా' అన్నారు, మేష్టారు.'

'ఆనుసార్ పిల్లలకి మేష్టర్లు గుర్తున్నట్టు మేష్టర్లకి ఎల్లా వుంటారులెండి,

ఒకరా పదిమందా వింతమందినని జ్ఞాపకం వుంచుకోగలరు. నాతో మరో యిద్దరు కుర్రాళ్లు రెడ్డి, సూర్యనారాయణ, ముగ్గురం కలిసి తిరిగేవాళ్ళం. నాచేతిలో బరో మీటర్ వోసారి విరిగిపోయింది...'

'ఔనౌను జ్ఞాపకం వచ్చింది. అప్పుడు మీరు సన్నగా వుండేవారు' అన్నారు మేష్టారు. మేష్టారికి ఎవర్ని నువ్వనాలో ఎవర్ని మీరనాలో ఎప్పుడూ ఆలోచించరు. చాకల్ని మంగల్ని కూడా 'మీరు' అండం కద్దు. భార్య నాట్య భంగిమలో నోటిమీద వాయించుకుని ముక్కుమీద వేలేసుకుని మేష్టార్ని వారిస్తూ వుంటుంది.

'ఆ సీతారామిరెడ్డేగదా యిప్పుడు మీ విద్యామంత్రి. సూర్యం కూడా కలకత్తా...'

'యేమిటీ! నా స్టూడెంటేనా విద్యా మంత్రి బాగా జ్ఞాపకం చేసావు. నేను యిప్పటి సెకండరీ ఎడ్యుకేషన్‌లో తేవలసిన మార్పుల గురించి టెక్స్టు బుక్కుల లోపాల గురించి ఆయనకి వో కాగితం పంపాలనుకుంటున్నాను. ఈ వూరు చాలా సార్లు వస్తూనే వుంటాడు. వచ్చేనెల్లో రావాలి కూడా. సీతారామస్వామి కల్యాణం యేటా చేయిస్తాడు. నాకాగితం స్వయం గానే యిస్తాను.'

వోల్డు స్టూడెంటు అవి ఇవి కొట్లాడి మేనల్లుడి చదువు ఎల్లా వున్నది కనుక్కొని సంతృప్తి పడి వెళ్లిపోయాడు.

# ఫిజిక్సు మేష్టారు


'నేను రామారావుని...మీరు అప్పటికీ యిప్పటికి మారలేదు మాష్టారు...'

'నమస్కారం మేష్టారూ, నేను వెంకట రమణని...మీరు అప్పటికి యిప్పటికి మారలేదు...'

నేను నేనంటూ చాలామంది మేష్టరు గారి వద్ద చదువుకున్న వాళ్లు పెళ్లి పందిట్లోనో, స్టేషన్‌లోనో, హాస్పటల్ లోనో రోడ్డు మీదో కనిపిస్తూ వుంటారు ఫలాని చోట పన్లో వున్నామని సెలవమీద వచ్చామని పలకరిస్తారు.

నాకు జ్ఞాపకం రాలేదనో, కొద్దిగా జ్ఞాపకం వస్తోందనో 'ఆరి భడవా నువ్వు జ్ఞాపకం లేకేమి'? అనో ఆయా వ్యక్తులికి సమాధానం యిచ్చి పైకి వచ్చినందుకు అభినందించి పంపుతారు.

వో సారి మేష్టారు చెవిపోటని హాస్పటల్‌కి వెళ్ళారు. అక్కడ డాక్టరు 'మీరా మేష్టారూ! యింతసేపు అవతల క్యూలో కూర్చొపోతే తిన్నగా లోపలికి వచ్చేలేక పోయారా? నేను తెలవదూ? ప్రకాశాన్ని. యిరవై ఎనిమిది నుండి ముప్పయివొకటి సంవత్సరం వరకు మీ దగ్గర చదివాను.' అని కబుర్లు చెప్తూ చెవి కడిగి చిన్న సీసాలో చెవికి చుక్కల మందు వేసి యిచ్చారు. 'ఈమాటు యే అవసరం




వచ్చినా రండి మేష్టారు, ఫలాన చోట వుంటున్నాను. మీరు అప్పటికీ యిప్పటికీ యేమీ మారలేదు' అని మేష్టార్ని పంపించాడు. వో రోజున మేష్టారు యింటికి వస్తుంటే త్రోవలో ఆయన ముందు వో కారు ఆగింది. అందులోని వ్యక్తి 'ఎక్కండి మేష్టారూ' అన్నాడు. 'మీ యింటి దగ్గర దించుతాను. మీ యిల్లు కనుక్కోవాలని మీరు యిక్కడ వున్నారా లేదా అని ఆలోచిస్తున్నాను. నేను మీ స్టూడెంటు సుబ్బారావుని ఈ వూరు స్టేట్‌బ్యాంకు యేజెంటుగా ట్రాన్స్‌ఫరై వచ్చాను. నా సన్‌ని మీ స్కూల్లో చేర్చాలనుకుంటున్నాను' అని చెప్తూ కావలసిన భోగట్టా స్వీకరించి ఆయన్ని యింటి దగ్గర దిగబెట్టాడు.

భార్యామణి ఎదురొచ్చి 'ఎవరిదండీ కారూ' అంటూ ప్రశ్నించింది.

'నా వోల్డు స్టూడెంటుట నాకు జ్ఞాపకం రాలేదు. ఈ వూరు స్టేట్‌బ్యాంకు యేజంటుగా ట్రాన్‌ఫరై వచ్చాట్ట. కొడుకుని మా స్కూల్లో చేరుస్తానంటున్నాడు.

'మీరు ఎవర్నీ జ్ఞాపకం పెట్టుకోరండీ మరీనూ. పోనీ సమయంలో సమయం మన శేషగిరి మాట చెప్పలేక పోయారా? పైకి ప్రొమోషన్ యిప్పించగలడేమో? ఒక బ్యాంకి కాకపోతేనేం వాళ్లకీ వీళ్లకీ యేవో వుంటూనే వుంటాయి. ఎక్కడికీ తిరగక్కర్లేదు తగు మనుష్యులు మీ వద్దకే వస్తున్నారు. కాని మీకు యిల్లని పిల్లలని యేమీ జ్ఞాపకం వుండదేమో. మీరు బాగుపడ లేదు సరే సరి. కాస్త అబ్బాయినేనా పైకి లాగండి. పెద్దపిల్లలిద్దరికీ మా అన్నయ్యే సంబంధాలు తెచ్చి పెళ్లిళ్లు చేసాడు. అప్పుడూ నామాట వినలేదు. యిప్పుడేనా చిన్నమ్మడిమాట జ్ఞాపకం పెట్టుకొని మీ స్టూడెంట్లల్లో చురుకైన వాడిమీద వో కన్నేసి వుంచండి.'

రమణమ్మగారి ఆలోచనలన్నీ ఈవాళ చాలా హుషారుగా సాగుతున్నాయి. ఆవిడకి నాలుగు లక్షలొచ్చి చేతిలో పడ్డట్టే వుంది. యిప్పుడే అరగంట క్రింద తనూ రుక్మిణమ్మగారు, సూర్యకాంతం, రాంబాయి గార్లు నలుగురుకూడి నాలుగు పావలాలు వేసుకొని వుమ్మడిగా పదిహేడు లక్షల లాటరీ టికెట్టు కొన్నారు. ప్రైజు డబ్బు నలుగురూ సమానంగా పంచుకుంటారు.

రమణమ్మగారు డబ్బు రాగానే ముందు చెయ్యవలసిన కార్యక్రమాల్లో ముందుది రెండు గదుల వాటాలోకి మార్చారు, ఐదుగదుల యిల్లు కట్టడం పూర్తి అయే దాకా ముందు యిల్లుమారాలి, మేష్టారికని ప్రత్యేకం వో గది వుండాలి. ఆయన మంచం క్రిందే పప్పుడబ్బాలు, కూరలకట్టలు వుండవలసిన అవసరంగాని రాత్రి పూట ఎలకలు మా మీదనుండి పరుగులెట్టవల సిన అగత్యంగాని వుండకూడదు వంటిల్లు కొంచె పెద్దదుండాలి. అప్పుడందులోనే డబ్బాలు, తట్టలు మంచినీళ్ల బిందె యిమిడిపోతాయి. పాపం శేషగిరి ఆ చిన్న కొట్లో స్నేహితుడొస్తే కూర్చోమనడానికి కూడా లేకుండా తంటాలు పడుతున్నాడు తీసుకునే యింటికి నూరురూపాయలు అద్దె అవుతే అవుగాక. తన మనసులో మాట దాచుకోలేక భర్తగారితో చెప్పింది. 'మీకు యిల్లు కట్టించాలని కార్లో తిప్పాలని నేను ఆలోచిస్తూ వుండగా మీరు కార్లో దిగారు! అది చాలా శుభసూచనగా నా కనిపిస్తోంది' అంది.

'చూడూ! నీ దగ్గర బంగారం యేమైనా మిగిలిందేమో అమ్మేయి. కాసు ధర బాగుంది బ్యాంకిలో వేసుకుంటే వడ్డీయేనా వస్తుంది. మెళ్లో ఆ మూడుపేటల గొలుసెందుకూ? అనక యే సినిమాహాల్లో ఎవడేనా వస్తువు తెంపుకుపోతే ప్రాణం వుసూరుమంటుంది.'

'నేను సినిమాకి వెళ్లి ఎన్నేళ్లయిందండీ? పోనీ ఈవాళ తీసుకువెళ్లి ఆమాటనండి!'

'అబ్బో నాకు రావడానికి కుదర్దు. ఇరవై మూడో తారీఖునుంచి పిల్లలకి పరీక్షలు, ప్రశ్నలు స్పెసిలు చెయ్యాలి బస్సులో తిరుగుతూనే వున్నావుగా అందులోనే గొలుసు తెంపుకోగలరు జాగ్రత్త' అన్నారు.

'ఘరానాగా దొంగ యింటికే రావొచ్చుగా? 'తే బంగారం' అని కత్తి చూపిస్తే యేంచేసేది? నాదగ్గర బంగారం లేదంటే 'ఎక్కడ దాచావ్' అని కొడ్తాడని ముందు జాగ్రత్తకి కొంచెం చిలకల పూడి బంగారం వుంచాను.'

మేష్టారు భార్యమెళ్లో గొలుసు తాకి చూస్తూ 'యిది బంగారంకాదూ?' అన్నప్పుడు ఆయన మొహంలో విచారరేఖ స్పష్టంగా కన్పించింది.


ఆవిడ మాట మారుస్తూ 'మీరు యేడాదికి ఎనభైమందికేనా విద్యాదానం చేసివుండరా? ఈ ముప్పైఐదేళ్ళల్లో ముప్పైఐదు ఎనభైలు రెండువేల ఎనిమిది వందలమందిని విద్యావంతుల్ని చేసి పైకి పంపారు. వోల్డుబాయిస్ అంతా తలో పదీ ఐదూ వేసుకుని మీకు సన్మానంచేస్తే అధమపక్షం యిరవైవేలు. అవి మీ చేతిలో పోస్తే ఎంత బాగుంటుంది?'

'సన్మానం నా వొక్కడికేనా మిగతా నచ్జెక్టులు చెప్పిన పదిమందికీ కూడానా' అన్నారు మేష్టారు.

'నవ్విస్తూనే పాఠం చెప్తారు మేష్టారు' అనుకుంది యిల్లాలు.

• * *

నిరుటికంటే సీతారాముల కళ్యాణం బాగా జరిగిందని చెప్పుకున్నారు. పందిరికే పదివేలు ఖర్చయిందని చెప్పుకున్నారు మంత్రిగారి చేతికి ఎముక్క లేదన్నారు. పంచరత్నాలు రాసిన ఐదుగురు



FDSAS1664TE

కురత్నార్ని వస్మానిరచి శాలువలు నూట పదహార్లు యిచ్చారుట. ఇంకా పురోహితు లని పూజార్నీకూడా సత్కరించారుట.

'పందిరికి పదివేలు తగలేస్తాడా? దేముడికి యిప్పుడు పెళ్ళెందుకు?' యింతమంది

# షిజీత్వు మేష్టారు

పిడ్డలకి తిండిలేకండా చేసాడే? మళ్ళీ పెళ్ళాంతో కులుకుతాడా' అంటు మంత్రి గారి ప్రత్యర్థులు తిట్టారు. రోడ్డు ప్రక్కని పేవ్‌మెంటు మీద పడుకునే అలగా జనంఅంతా ఆరాత్రి పందిట్లో విద్యుత్‌దీపాలూ చూస్తూ మేల్కొనే వున్నారుట!

మేష్టరుగారు మంత్రిగార్ని కలుసు కున్నారు. ఆయన ఎదురొచ్చి సాదరంగా తీసుకువెళ్ళి తన కెదురుగా సోఫాలో కూర్చోబెట్టారు. ఆయన యిచ్చిన కాగితం తప్పకుండా పరిశీలిస్తా నన్నారు. ఉపా ధ్యాయుల జీతం, గ్రేట్యుయిటీల విషయం చాలా పట్టుదలగా వున్నారుట. ఉపాధ్యా యుల విశిష్ట సేవకి కూడా సాలీనా రెండు వేలు రొక్కం అవార్డు ఏర్పాటు చేస్తారుట. 'మీ మాటముందుగా నాకు జ్ఞాపకమే' అంటూ చెప్పి 'మీరు అప్పటికీ యిప్పటికీ యేమీ మారలేదు మేష్టారూ' అన్నారు. మంత్రిగారు మల్లెపువ్వులాంటి తెల్లని ఖద్దరుకోటు, ఎక్కడా నలగలేదు, వేసుకునున్నారు. మేష్టారు తన కోటువైపు వొకసారి చూసుకున్నారు. 'నేను వుద్యో గంలో చేరాకా యిది మూడో కోటు. కుట్టించి మూడేళ్ళయింది. రంగు వెలిసింది. క్రొత్తగా వుండగా ఎవరూ చూడ్డం పడలేదు. అందుకే నాలోమార్పు ఎవరికీ కనిపించడం లేదు' అనుకున్నారు మనసులో. మంత్రిగారి మాటలు అబద్ధాలేమో అనిపించినా తియ్యగా వున్నాయి. యేమో! వొకవేళ నిజం, కాకూడదూ అనుకున్నాడు. సంతోషంగా వుంది. అతి సంతోషంవల్ల కూడా మేష్టా రికి నీర్సం వచ్చినట్లయింది. కొంతసేపు మాటలయాకా మంత్రిగారిచ్చిన కాఫీ బిస్కట్లు తిని 'వెళ్ళొస్తా'నని లేచారు.

మంత్రిగార్కి తన మేష్టారిమీద వున్న గౌరవానికి నిదర్శనంగా, కూడా వెళ్ళి కారెక్కించి యింటికి పంపేరు.

'యేమండీ మంత్రిగారి కబుర్లేమిటి? నా 'శుచి—రుచి' మాట చెప్పారా? అదే మండీ అల్లా నన్నారేం?' అంది భార్య వాలుకుర్చీలో జేర్లబడ్డ భర్తని చూసి.

'యేం లేదులే. యేదో కొద్దిగా నీర్సంగా వుంది.'

'అబ్బ! ఇహ ఆ స్కూలు మానేద్దురూ బాబూ' అంది భార్య.

'అబ్బే! మధ్యలో మానేస్తే పిల్లలు 'సఫర్' అవుతారు. వాళ్ళకి అన్యాయం కాదూ? ఈ మార్చికి ఈ బాచ్ వెళ్ళి పోయాక చూద్దాంలే' అన్నారు మేష్టారు. ●





"బిరకగా ఉండే
పాత కాలపు
పళ్ల పొడులు
మీ చిగుళ్లకు పళ్లకు
చెరుపు చేస్తాయి..!"

## కాల్గేట్ టూత్ పౌడరుతో మీ చిగుళ్లను, పళ్లను కాపాడు కోండి. చెడు శ్వాసను అరికట్టండి !

పాతకాలపు బిరకగా ఉండే పళ్ల పొడులు మీ చిగుళ్లకు, దంతాలకు చెరుపు చేస్తాయి, పళ్లపై నుండే ఎనామెలును అరగదీస్తాయి. కాల్గేట్ టూత్ పౌడరు అతి మెత్తగా ఉంటుంది. దాని లోని నునుపు నిచ్చు పదార్థం మీ పళ్ల మీది పాచి పొరలను తొలగిస్తుంది, వాటిని తెల్లగా శుభ్రంగా చేస్తుంది. అది మీ చిగుళ్లను మృదువుగా తోముతుంది. కాల్గేట్ లోని పుష్కలమైన నురుగు నిచ్చే ధర్మ్య పళ్ల సందుల లోనికి చొచ్చుకొనిపోయి చెడు వాసనను, దంతక్షయ కారకములైన-సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది. అందువల్లనే, కాల్గేట్ టూత్ పౌడరు చెడు శ్వాసను తక్షణమే అరికట్టి, దంతక్షయమును నివారిస్తుంది. దాని చల్లని, ఉల్లాసకరమైన రుచిని మీరెంతో మెచ్చుకుంటారు కూడా!

...పొదుపైన
అధునాతన దంత సంరక్షణ
ఉండగా, పాత కాలపు
పళ్ల పొడి వాడటం దేనికి!

మీ కుటుంబం కోసం,
ఎకానమీ సైజు కాల్గేట్ టూత్
పౌడరు కొనండి ఈ నాడే!
నెలల తరబడి వస్తుం
దొక డబ్బా!




...పరిపూర్ణ దంత సంరక్షణ
కోసం వాడండి,
శాస్త్రోక్తముగా
రూపొందింప బడిన
కాల్గేట్ టూత్ బ్రష్

[illegible]